# తాత్త్విక కథలు

## 1. శ్రద్ధ ముఖ్యం

ఓసారి ఒకరు బుద్ధుడి దగ్గరికి వచ్చి నమస్కరించి అడిగారు.

"స్వామీ! మీరు గొప్ప బోధకులు. అయినా మీ శిష్యులంతా ఎందుకు మీలా నిర్వాణాన్ని పొందలేక పోతున్నారు?"

బుద్ధుడు చిన్నగా నవ్వి అడిగాడు.

"నువ్వు ఈ ప్రాంతం వాడివి కాదనుకుంటా. నీ స్వగ్రామం ఏది?"

"ఇక్కడికి వంద క్రోసుల దూరంలోని సవత్తి అనే గ్రామం స్వామీ నాది." జవాబు చెప్పాడతను.

"అక్కడి నీ ఇంటికి, ఇక్కడినించి నీ మిత్రులెవర్నయినా వెళ్ళమంటే వెళ్ళగలరా?"

"లేదు స్వామీ. అందరూ అక్కడికి వెళ్ళలేరు. నే చెప్పే దారిని శ్రద్ధగా విన్నవారే మా గ్రామంలోని నా ఇంటికి వెళ్ళగలరు."

"అలాగే, నేను చెప్పిన సాధనలన్నీ చేసి నిర్వాణం మీద మనసు పెట్టి చివరిదాకా ప్రయాణించినవారే నాలా నిర్వాణ స్థితికి చేరుకో గలిగారు." నవ్వుతూ జవాబు చెప్పాడు బుద్ధుడు.